# నాగమ్మ జీవయాత్ర

★

ఘట్టి ఆంజనేయశర్మ

వెలుగు చీకటిని చీల్చుకుపోయినట్లు, స్టేషనులో ఆవరించిన విషాదనిశ్శబ్దాన్ని, పరుగెత్తి ఒగర్చిన రైలు భగ్నం చేసింది. నాగమ్మ, శూన్యంలోకి గంటల కొద్దీ చూస్తూ మైమరచినదల్లా, ఒక్కసారి లేచి నుంచుంది. ఇప్పుడామె రైలు ప్రయాణీకుల్లో ఒకర్తె అని అనుకోవచ్చు; లేకపోతే ఈ విశాల ప్రపంచంలో దేనికోసం ఆమె పడిగాపులు పడుతున్నట్లు?

ప్రయాణీకులు అనేక దిక్కుల ప్రయాణం చేస్తారు. మీలో ఎవరన్నా నాగమ్మని, 'ఎక్కడికి ప్రయాణం?...' అంటే, ఆమె వెంటనే సమాధానం చెబుతుందనుకో నక్కరలేదు. మీలో కొంతమందికి ఆమె దొంగతనం చేసి పరారి అవుతోందనో, లేక కమ్యూనిస్టుదళంలో వుందనో సందేహం వస్తే, దానికి ఆధార మేమీ లేదని చెప్పగలను. నాగమ్మ గొరిల్లా యుద్ధాలు చేయలేదు. ఒకరికి కష్టం కలిగించేటట్లు మాట్లాడలేదు. ఉత్కృష్టమైన శీలానికి, లోకం ఎరుగని త్యాగానికి ఆమె సజీవంగా నిలిచి వుంది.

నాగమ్మ, చంద్రుడు రాత్రిపూట తొంగి చూసే గుడిసెల్లో జన్మించి, మిల్లు యజమాని చేత బలాత్కరించబడి, అతడిని గాయపరిచి, తాను మరణించి, పతితులు, భ్రష్టులైన కార్మికుల్లో విప్లవోద్రేకం కల్గించిన నాయకురాలు, అమరజీవి కాదు. లోకం కష్ట సుఖాల్తో, దైనందిన సమస్యల్తో సంబంధంవుండబోని జమీందారు భార్యకాని, కూతురుగాని కాదు.

ఆమె ప్రబంధకావ్యాల్ని జీర్ణించుకొన్న పండితురాలు కాదు. అక్షరజ్ఞానం లేక పోనూ లేదు. నాగమ్మని ఈ భారతవర్షంలో అనాదిగా పుడుతూ చస్తూవుండే, ఎవ్వరికీ తెలియని, అశేష స్త్రీ జనంలో వొకతె అని అనుకోవచ్చు.

'ఆకలి...దాహం...నిద్ర...' రైలు పరుగెత్తుతోంది. నాగమ్మ ఒక నిట్టూర్పు విడిచింది. మొదటిసారిగా, ఈ రత్న గర్భలో, ఈ పవిత్ర దేశంలో, ఋషులు వేదగానం చేసిన ఈగడ్డన, పతివ్రతలు తమ శక్తితో లోకాన్ని వణకించి సృష్టిని తారుమారుచేసిన ఈ భూమిలో, 'అరవై సంవత్సరాల పోరాటం జరిపాం' అని సగర్వంగా చెప్పుకొని విప్లవోద్యమాలను తిరస్కరించి ఏ సిద్ధాంతాలకోసం ఈ పోరాటం జరిపారో, వాటిని విస్మరించిన కాంగ్రెసు ప్రభుత్వం రాజ్యం చేస్తున్నదన్న ఈ స్వతంత్ర దేశంలో జన్మించినందుకు.

నాగమ్మని అబల అన్నారు. పుస్తకాల్లో అట్లా వ్రాశారు. ఇంకా ఆమె సబల ఎలా అవుతుంది? ఆమెకు విద్య, ఆస్తి హక్కులు, వివాహనిర్ణయం తామే స్వీకరించారు.

ఆమె పుట్టినపుడు దుందుభులు మ్రోగలేదు. నక్షత్రాలు రాలలేదు. మేళవాయిద్యాలు, శుభసందేశాలు, విందులు, ఉత్సవాలు ఏమీ లేవు. కనీసం తన అన్న పుట్టినప్పుడు జరిగిన తంతుకూడా జరుగలేదు. కొందరు లోపల, బయట కూడ విచారించి, దుఃఖించారు. ఆమె ఏమన్నా పున్నామనరకంనుండి వారిని విముక్తిచేస్తుందా? తద్దినాలు, శ్రాద్ధకర్మలకి పనికి వస్తుందా?

తల్లితండ్రుల దెబ్బలు, అన్నల చీత్కారాలతో ఆమె బాల్యం గడిపింది. ఆమె సమాన హక్కులంటూ అన్నతో పాటు వందయెకరాల పొలం అడుగుతుం దనుకోనక్కరలేదు. కనీసం తన కన్నివిధాలా సరిపోయేవరుణ్ణి ఆమె కోరుకుంది మనస్సులో. టాగూరు మూగ శుభలాగా, ఆమె మాట్లాడలేదు-ఆమెని ఎవ్వరు అడగలేదు. ఆమాట కొస్తే అన్ని ఏళ్లువచ్చిన ఆమె అమ్మని కూడా, వాళ్ళనాన్న ఏ విషయంలోను సంప్రదించలేదు. నిజమే! ఆమెకు చదువా, పాడా?... పోతే, ఆమె చాలకాలం క్రిందట 'గృహలక్ష్మి' బిరుదాన్ని పొంది, అందరూ 'భళీ' అంటే సంతోషించా ననుకుంది.

నాగమ్మ భర్తనిగురించి విశేషించి చెప్ప పనిలేదు. ఆయన పోతూ ఇద్దరూ ఆడపిల్లల్ని, ఇద్దరు మొగపిల్లల్ని ప్రసాదించి పోయినాడు. అత్తగారు, 'కోడరికం' స్త్రీ ఉత్తీర్ణురాలవలసిన పరీక్షల్లో ఒకటిగా ఆమెకు జ్ఞాపకం చేసింది. తెలివిగలదైతే, నాగమ్మ ఈ పరీక్షకు తన కోడలిని తయారు చేసుకోవచ్చు!...

ఆమె 'లా' చదవలేదు. స్త్రీల హక్కులు, పోరాటాలు ఆమెకు తెలియవు. వాటిల్లో పాల్గొనే తీరికా, ఉత్సాహమూ ఆమెలో లేవు. భర్తపోయిన తర్వాత ఆమె తన ఇంటిని దోచుకొనే బంధువర్గాన్ని ఏమీ అనలేదు.ఆమెకు న్యాయంగా కొంత అనుభవించే హక్కువుండవచ్చు. అయితే ఈ రత్నగర్భలో సాంఘిక అనాది చట్టాలేగాని, దోపిడిగాళ్లు, అవినీతిపరులు నెలకొల్పిన శాసనాలకు ఏవి వున్నా వాటికి పీలులేదు.

ఆమె తన భావినిగురించి, పిల్లల్నిగురించి ఆలోచించింది. ఇప్పుడామెను చూసి భయపడని బంధువులు లేరు. ఎవరింటి మీదికొస్తుందో అని! నాగమ్మ అమెరికాలో వుంటే ఈపిల్లల్ని ఎవరికోయిచ్చి, లేక (ప్రభుత్వ శరణాలయాలలో) ఎక్కడో వుంచి, చక్కా, ఇంకో పెళ్ళి చేసుకొని వుండును! వందయెకరాల పొలంవున్న స్త్రీని యెవడు చేసుకోడుకనుక!...

'ఆకలి...దాహం...నిద్ర...'కాని ఈనాగమ్మ మళ్ళీ పెళ్ళిచేసుకోలేక, చేసేవారూ లేక, దిక్కులేక, వున్న అన్నలని ఆశ్రయించింది. ఆమె అన్న ఆశ్రయమిచ్చి ఆమె నెత్తిన పాలుపోయలేదు. వంటమనిషిని మానిపించాడు. ఆఫీసు కుర్రాళ్ళగా మేనల్లుళ్ళు పనికొచ్చారు. బావమరిది ఆస్తి తన చేతిలోకి వచ్చింది. ఇదంతా రూపాయణా పైసలతో లెక్కించే గుమ్మం తొక్కనిచ్చాడు; మరి లెక్కలు అవి చదువుకున్నాడు ఆయన!...చదువు జీవితంలో వుపయోగపడాల్సిన విధం, అవసరం ఆయనకి తెలుసంటారు. అన్నభార్య, అన్న మొదటిక్లాసులో ప్రయాణం చేస్తూ తనని, పిల్లలని మూడవక్లాసులో ఎక్కించినపుడు, పిల్లలు పాలు ఎక్కువ తాగుతున్నారని విడిగా, పాలలెక్క ఏర్పరచినపుడు ఆమె విచారించింది. ఇది ఆమెలో వున్న గొప్పలోపం!...

నాగమ్మ అన్నగారింటిలో వంటమనిషిగా వుండి కూతుళ్లకు పెండ్లిచేసి, కొడుకులకు చదువు పూర్తిజేసింది. ఇదంతా, హిందూ ధర్మములో చెప్పబడే 'కర్మ' అనుకొని వూరుకుంది. దీనికి ప్రజలూ విశేషం విలువ ఇవ్వలేదు. అది 'లోకం తీరే' అన్నారు. పోగా, భావాలంటూ పీకి పోయే కొందరు కవుల కలాలలో ఈమె ఆత్మ ఆక్రోశించింది. నూటికి, కోటికి వున్న ఒకరిద్దరు అరిచినంతమాత్రాన దీనికి విలువ లేదు. ఈర్ష్య పడేవారిగా భావించి లోకం వారిని బహిష్కృతుల్ని జేసింది.

నాగమ్మ కూతుళ్లు, ఆమెవలెనే నిస్సహాయులు గనుక ఏమీ చెయ్యలేదు ఆమెకు. కొడుకుల్లో, భీష్ముల్ని ఆమెచూద్దామనుకుంది. నిజంగా భీష్ములేవాళ్లు!... పోతేవారి భార్యలు వారిని అలాకాకుండా చేశారు!

ఇలా తిరస్కరింపబడిన ఈ దీనురాలికి వంట వచ్చుకదా, అన్నగారు లేడా అని అడగవచ్చు. ఆమె ముసలిదైంది. ఇదివరకులాగా శక్తీ అదీ లేదు. ఆమెకు ఎవరు వుద్యోగంయిస్తారు? పోనీ కొడుకులైనా ఎవరింటిలోనన్నా యిప్పిస్తారా ఆవుద్యోగం అంటే, అది వారి ప్రతిష్ఠకు భంగకరం. తిండి, నీరులేక మాడి ఏ చెట్టుక్రిందో చస్తే ఏంగాక?...'కర్మ' అని అందరూ మరిచిపోతారు; కాని వంటపూటకోసం భరిస్తారా?. పూర్వం ఇది మాత్రం మామగారింటిలో చేయలేదా అని అడగవచ్చు. ఇంతకీ 'రక్తబంధువు', వారిని ఉద్ధరించినవాడాయెను కనుక ఆ సందేహం ప్రజలలో ఎవ్వరికి లేదు. తాము సంఘంలోని వ్యక్తులు కనుక సంఘాన్ని తిరస్కరించడం, తమరక్షణకి, సౌఖ్యానికి భంగం! ...

నాగమ్మ అన్నగారు వేదాంతి. ఏవిషయం వారు పట్టించుకోరు. సంఘసంస్కరణ, వితంతు వివాహం, రాజకీయాలు ఇవన్నీ బూటకాలు. కత్తికిలేని దురద కందకెందుకు? కొడుకులికి, కూతుళ్లకి పనికిరాని నాగమ్మ తనకెందుకు... పోనీ ఆయనకూ సంసారం చాలవుంది. ఈ భారం ఏలా మోస్తాడు అని అడుగవచ్చు.

ఆయ్యనకి సంతానం లేకపోయినా, పున్నామ నరకంనుంచి బయటపడే మార్గం చూసే కొడు

తను దత్తత చేసికొన్నాడు. ఈ లోకంమీది కంటె పరలోకంమీద ఆయనకి నమ్మకం ఎక్కువ.

రైలు పోతూవుంది. రైలు ఎక్కడ బయలుదేరి ఎక్కడికి చేరుతుందో అందరికి తెలుసు. కాని నాగమ్మకి మాత్రం తన జీవయాత్ర ఎక్కడికో, ఇంతవరకు తెలియదు. వెంటనే ఆమె చొరడానికి అనుమతించని లోకం, క్రమంగా మాడి, కృశించి, తిరస్కరింపబడి, నమిలి, ఎంత మెల్లిగాచస్తేఅంతమంచిదంటుంది: ఈ లోకంలో, ఎవరికీ తెలీని తన్ను ఉద్ధరించే దెవరూ? బీదలు-భాగ్యవంతులు; పతితులు- భ్రష్టులు; పావుకార్లూ- ధనికులు; స్త్రీ-పురుషుడూ; మతం - మోక్షం; శాంతి - దౌర్జన్యమూ: సత్యము - అసత్యమూ; త్యాగం-కర్మ; స్వార్థమూ ఆమె మనస్సులో ఘర్షణపడుతున్నాయ్. తనలాంటి వారి అజ్ఞాతసమాధులమీద, ఈ యుద్ధఫలితం భావిలో లిఖింపబడవచ్చు. క్రీస్తు, బుద్ధుడు, గాంధి, వివేకానందుడు, మహమ్మదు, మొదలుగాగలసత్యమూర్తుల సందేశం ఒకవైపు పతితులు, భ్రష్టులు గర్జించే మరోప్రపంచనినాదం ఒకవైపు ఆమెకు లీలగా వినిపిస్తున్నాయ్.

కాని ఆకలి, దాహం, నిద్ర!...ఎక్కడ అంతమవుతుందో తన జీవయాత్ర!...రైలు ఆగిపోవాల్సిన స్టేషను సమీపిస్తోంది. దూరాన అగుపడే వెలుగునీడలు, తను అనుభవించిన జీవితం, కలలుగన్న జీవితం- ఈ తారతమ్యాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. కాని ఆకలి, దాహం, నిద్ర.

రైలుకి గమ్యస్థానం వుంది...మరి నాగమ్మ జీవయాత్రకో?

కాని ఆకలి, దాహం, నిద్ర!

# మన గాజు పరిశ్రమ

మన దేశమునకిది పురాతన పరిశ్రమ. ఇతర దేశములమించి మనదేశమీ పరిశ్రమను అభివృద్ధి చేసినది. యావత్ప్రపంచమునకు యోగ్యమైన గాజు వస్తువులను ఇండియా అందచేసినదని ప్లినీ వ్రాసియున్నాడు.

ఆంగ్లేయుల ఆధ్వర్యము, తదనంతరము వారిపాలన మనకు ప్రాప్తించినవి. అన్నిటితోపాటు ఈ పరిశ్రమయు అధోగతి పాలైనది. 1875 వ సంవత్సరమునకు ఇంగ్లాండులో 240 కర్మాగారములు గాజు వస్తువుల నుత్పత్తిచేయుచుండెడివి. స్వప్రయోజనపరులైన ఆంగ్లేయులు కొద్దిమంది నిరంకుశ రాజుల సహాయముతో తిరిగి తల యెత్తుకొనలేని స్థితిలోనికీ పరిశ్రమనుదెచ్చిరి.

కర్మాగారములలో పనిచేయువారు, గాజులను స్వయముగా తయారుచేసుకొను లక్షలాది శ్రామికులు నిరుద్యోగులై తిండికి గుడ్డకు కరవు వాచిరి. ముఖ్యముగ సంయుక్త రాష్ట్రములలోని ఫిరోజిబాద్ జిల్లాకు, బొంబాయిలోని బెల్గాము జిల్లాకు తీరని నష్టము సంభవించెను.

పందొమ్మిదవ శతాబ్దపు చివరను, తరువాతను ఈ కర్మాగారములు చాల స్థాపించబడినవి. 1892–93 సంవత్సరముల మధ్య తెల్లవారిచే మన దేశమున ఐదు గాజు ఫ్యాక్టరీలు నిర్మింపబడినవి. 1909 లో మరియొకటి వెలసినది. కాని యివి అభివృద్ధి చెందలేదు.

ఎన్ని క్లిష్టపరిస్థితు లున్నప్పటికి భారతీయులు 16 గాజు పరిశ్రమాగారములను నెలకొల్పగల్గిరి. జయప్రదముగ వాటిని నడుపుటకు ఆంగ్లపాలనే అడ్డంకియైనదని చెప్పక తప్పదు. మొదటి ప్రపంచ యుద్ధమునాటికి మూడు ఫ్యాక్టరీలు మాత్రమే నిలిచినవి.

యుద్ధ ప్రారంభముతో ఎగుమతి దిగుమతులు స్తంభించినవి. దేశమున ప్రజలలో గాజు వస్తువులకై ఆరాటము పెరిగినది. భారతపరిశ్రమలకు చేతినిండ పని లభించినది. లాభమును అధికమయ్యెను. ఆర్థికముగా శ్రామికులు నిలద్రొక్కుకొనిరి. మన దేశీయులుగూడ రకరకముల సామానులను చక్కగ తయారు చేయసాగిరి.